పైడితల్లి.. సిరిమాను శోభ



కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరానికి పైడి తల్లి పండగ శోభ సంతరించుకుంది. ఆలయం విద్యుత్తు దీపాలతో దేదీప్యమానంగా కనిపిస్తోంది. సోమ వారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా మొదటి మంగళవారం భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం శాంతినగర్, గవరవీధి, సంతోష్‌నగర్, మంగళవీధి, అబాద్‌వీధి, అంబటిసత్రం తదితర ప్రాంతాల మహిళలు ఘటాలతో చదురుగుడికి చేరుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పులివేషాలు, మధురవాడకు చెందిన బి.ముసలమ్మ నాట్య బృందం, చిన్నారుల భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఏర్పాట్లు వేగవంతం చేయండి

సిరిమాను ఉత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయాలని శాసనసభ్యురాలు పూసపాటి అదితి గజపతిరాజు ఆదేశించారు. హుకుంపేట, సిరిమాను వచ్చే మార్గం, ఆలయ పరిసరాల్లో పనులను పరిశీలించారు. నగర పాలక సంస్థ పారిశుద్ధ్యం, రోడ్లు, కాలువల పనులు త్వరితగతిన చేపట్టాలని కమిషనర్ పి.నల్లనయ్యను ఆదేశించారు. రోడ్డుపై భక్తుల రద్దీ లేకుండా ఖాళీస్థలంలో నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేస్తే మంచిదేమో పరిశీలించాలన్నారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకున్నారు.

పటిష్ఠ భద్రత

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి తొలేళ్లు, సిరిమానోత్సవాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆ రోజుల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి.. గతంలో విధులు నిర్వహించిన అధికారులు తమ అనుభవాలు, సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పురపాలక అధికారులతో సంప్రదించి, వాహనాలకు పార్కింగ్ ప్రాంతాలు కేటాయించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదికల వద్ద బందోబస్తు అవసరమని సూచించారు. సిరిమాను తిరిగే మార్గంలో అనుమతులు ఉన్న వారినే విడిచి పెట్టాలని, భక్తులు రాకుండా చూడాలన్నారు. సిరిమానోత్సవం ముగిసే సరికి చీకటి అలుముకుంటే ప్రత్యామ్నాయంగా లైటింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐలు ఏవీ లీలారావు, ఆర్‌వీఆర్కే చౌదరి, ఎస్.శ్రీనివాస్, బి.వెంకటరావు, టి.శ్రీనివాసరావు, సూరినాయుడు, జి.రామకృష్ణ, ఎన్‌వీ ప్రభాకరరావు, టీవీ తిరుపతిరావు, ఆర్‌ఐలు ఎన్.గోపాలనాయుడు, టి.భగవాన్, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


హుకుంపేటలో రథాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలు: విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలు, అమ్మవారి సిరిమానోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. మంగళవారం ఉత్సవాలు, అమ్మవారి సిరిమానోత్సవం తిరిగే ప్రధాన రహదారి, కోట, అయోధ్య మైదానం, మాన్సాస్ గ్రౌండ్, విజ్జీ స్టేడియాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి పరిశీలించారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, డీఆర్వో ఎస్.డి.అనిత, సీపీవో బాలాజీ పాల్గొన్నారు. నగరంలో సిరిమాను తిరిగే ప్రాంతాన్ని ఎస్పీ వకుల్‌జిందాల్ పరిశీలించారు.


సిరిమాను తయారీ పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

సాలూరు అభివృద్ధికి రూ.30 కోట్లు

మెంటాడ, న్యూస్‌టుడే: సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆండ్ర, లోతుగెడ్డలో పింఛను నగదు పంపిణీ చేశారు. పింఛన్ మొత్తం పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు మూడేసి సెంట్ల స్థలాన్ని కేటాయించి, రూ.4 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అరకు పార్లమెంటు పరిధిలో పోడు వ్యవసాయం చేసే గిరిజన రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ సర్పంచి భీమారావు, వార్డు సభ్యులు, ఆర్యవైశ్య సంఘాధ్యక్షుడు కె.సత్యనారాయణ, పలు కుటుంబాలు మంత్రి సమక్షంలో తెదేపాలో చేరాయి. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరావు, అరకు పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు అన్నవరం పాల్గొన్నారు.


మంత్రి సంధ్యారాణితో తెదేపాలో చేరిన సభ్యులు

నగరానికి మరో ప్రగతిహారం

- ఆర్‌అండ్‌బీ కూడలిలో బహుళ అంతస్తుల భవనం
- పీపీపీ విధానంలో నిర్మాణానికి ప్రభుత్వం యోచన?


చుట్టూ చెట్ల మధ్య ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ప్రదేశం

ఈనాడు, విజయనగరం

విజయనగరం ఆర్‌అండ్‌బీ కూడలిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ విధానం) కింద చేపట్టాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

ఇక్కడి స్థలాన్ని ఏ రకంగా వినియోగించవచ్చో కేంద్ర మాజీ మంత్రి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఇందుకు సీఎం సుముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. 12 అంతస్తుల భవన సముదాయంలో ఐనాక్స్ సినిమా థియేటర్లు, మూడు నక్షత్రాల హోటల్, 50కి పైగా వివిధ రకాల వ్యాపార దుకాణాలు రానున్నాయి. నగరానికి ఇది మరో ప్రగతి హారం కానుంది.

నాడు వైభవం..

దశాబ్దాలుగా ఆర్‌అండ్‌బీ కూడలిలోని అతిథి గృహం ఎంతో మంది ప్రముఖులకు సేవలు అందించింది. ఉమ్మడి జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రులు, ఉన్నతాధికారులు, వీఐపీలు బస చేసేవారు. నగరానికి ఇదో గుర్తుగా (ల్యాండ్ మార్క్) మారింది. గత పాలకులు నిధులివ్వక.. నిర్వహణకు నోచుకోక ఈ ప్రదేశం పిచ్చిమొక్కలతో ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తోంది. పుష్కర కాలంగా దీని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రకరకాల ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విలువైన ఈ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. పీపీపీ విధానంలో బహుళ అంతస్తుల భవన సముదాయం నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయ వనరు అవుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

పునర్నిర్మాణ నిర్ణయం రద్దు

ఆర్‌అండ్‌బీ బంగ్లా పునర్నిర్మాణానికి వైకాపా ప్రభుత్వం 27.02.2023న జీవో జారీ చేసింది. రూ.1.61 కోట్లు మంజూరు చేస్తూ సాంకేతిక ఆమోదం తెలిపింది. ఈ పనికి మూడు సార్లు టెండర్లు పిలవగా గుత్తేదారుల నుంచి స్పందన కరవైంది. నాలుగో సారి 26.07.20024న విశాఖలోని మధురవాడకు చెందిన ఓ సంస్థ ముందుకొచ్చింది. రూ.119.74 లక్షల వ్యయంతో ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు గత నెల 5న ఒప్పందం కుదిరింది. ఇంతలోనే గత ఏప్రిల్ ఒకటికి ముందు మంజూరై 25 శాతం పూర్తి కాని పనులు నిలిపివేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గుత్తేదారు కుదుర్చుకున్న టెండరు ఒప్పందం రద్దవుతుంది. ఇదిలా ఉండగా సుమారు నాలుగున్నర ఎకరాలకు పైగా ఉన్న విస్తీర్ణంలో చిట్టడవిని తలపించే ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పరిసరాల శుభ్రత పనులను ఇటీవల ప్రారంభించారు. ఇంతలోనే ప్రభుత్వ ఆదేశాలతో ఈ పనులు కూడా నిలిపివేశారు.

పింఛన్ల పంపిణీలో మనమే ప్రథమం


విజయనగరంలో పంపిణీ పరిశీలిస్తున్న కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విజయనగరం మయూరి కూడలి, రాజాం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మంగళవారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభించారు. నేరుగా పండుటాకుల ఇంటి వద్దకు వెళ్లి బయోమెట్రిక్, ఐరిస్ వంటి హాజరు తీసుకుని నగదు అందజేశారు. జిల్లా పాలనాధికారి డా.బీఆర్ అంబేడ్కర్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తిలు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. పంపిణీలో వెనుకబడిన సచివాలయాలపై దృష్టి సారించి అప్రమత్తం చేయడంతో ఉదయం 11.40 గంటలకు జిల్లా ప్రథమ స్థానానికి చేరింది. రాత్రి 8 గంటల వరకూ జిల్లా తొలి స్థానంలోనే ఉంది. ఏకంగా 98.41% పంపిణీ పూర్తి చేసినట్లు గుర్తించారు. ఇంకా 4,428 మందికి రూ.1.86 కోట్ల నగదు అందించాలి.

జిల్లా	పింఛన్లు	అందజేత	నగదు	పంపిణీ (కోట్లలో)
విజయనగరం	2,78,240	2,73,812	115.86	114.00

భూచోళ్లు ఎందరో..

ఫ్రీహోల్డ్‌పై పునఃపరిశీలన

గతంలో పేదలకు ప్రభుత్వాలు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల లావాదేవీలపై నిగ్గు తేల్చే దిశగా కూటమి సర్కారు అడుగులేస్తోంది. ఫ్రీహోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన భూములకు సంబంధించి పునఃపరిశీలన జరపాలని ఆదేశించింది. భూములకు రెక్కలొచ్చిన మండలాల్లో వాటి తాజా పరిస్థితి తెలుసుకోవాలని పేర్కొంది. ప్రస్తుతం ఆ పనిలో ఉభయ జిల్లాల రెవెన్యూ యంత్రాంగం ఉంది.



విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే

భూముల్లేని పేదల జీవనోపాధికి గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి.. పట్టాదారు లేదా వారి సంతానం అనుభవిస్తుందా.. లేదా.. అమ్మకాలు జరిగితే ఎవరు కొనుగోలు చేశారనే కోణంలో ఆరా తీస్తున్నారు.

వైకాపా ప్రభుత్వం 20 ఏళ్లు గడిచిన అసైన్డ్ భూములపై హక్కులు కల్పించనున్నట్లు ప్రకటించింది. ఇందుకు అర్హత గల భూములను జిల్లాల వారీగా లెక్కలు తీసింది. విజయనగరం జిల్లాలో 5,618.36 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వగా 191 ఎకరాల రిజిస్ట్రేషన్ పూర్తయింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 16,201.93 ఎకరాలకు 187 ఎకరాల్లో రిజిస్ట్రేషన్ జరిగింది.

దస్త్రాల తనిఖీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా భూముల రిజిస్ట్రేషన్లు మూడు నెలల పాటు నిలిపివేయాలని ఆదేశించింది. వైకాపా పాలనలో జారీ చేసిన జీవో మేరకు నిబంధనలు ఏ మేరకు అమలయ్యాయి.. ఎక్కడైనా ఉల్లంఘించారా. . అప్పట్లో ఈ భూములపై వైకాపా పెద్దలు కన్నేసి గెద్దల్లా తన్నుకుపోయారని వెల్లువెత్తిన ఆరోపణల్లో వాస్తవం ఏమిటి.. వాటి తాజా పరిస్థితిపై మండల తహసీల్దార్ల నుంచి ప్రభుత్వం నివేదిక కోరింది. అప్పట్లో ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు కొందరు మండల రెవెన్యూ అధికారులు నడుచుకున్నారు. ప్రస్తుతం కొన్ని మండలాల తహసీల్దార్లు, జేసీ స్థాయిలో లోతుగా పరిశీలించనున్నారు. ఆగస్టు నెలలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా విజయనగరం జిల్లాలో పర్యటించారు. భోగాపురం సహా పలు మండలాల్లో భూముల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

జిల్లాలో 2003కు ముందు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములపై విజయనగరం కలెక్టరేట్‌లో మంగళవారం పునఃపరిశీలన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత క్షేత్రస్థాయిలో, తర్వాత కార్యాలయం స్థాయిలో పరిశీలన పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాస్థాయిలో పునఃపరిశీలన నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉభయ జిల్లాల్లో ఫ్రీహోల్డ్ చేసిన భూములకు సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో దస్త్రాలు, కలెక్టరేట్‌లోని దస్త్రాలతో పోల్చి చూస్తున్నారు. దీన్ని బట్టి అధికారికంగా ఎన్ని ఉన్నాయి? అనధికారికంగా ఉన్నవి ఎన్నో తేల్చనున్నారు. ఈ విషయమై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా బుధవారం నాటికి దీనిపై స్పష్టత రానుందని బదులిచ్చారు.

స్వచ్ఛతే

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే:

కేంద్ర ప్రభుత్వం 2014 అక్టోబరు 2న ప్రారంభించిన 'స్వచ్ఛ భారత్'లో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకుంది. గ్రామాలు, పట్టణాలను బహిరంగ మల విసర్జన రహితంగా తీర్చిదిద్దాలన్న కేంద్రం పిలుపుతో అప్పటి తెదేపా ప్రభుత్వం రాష్ట్రంలో ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్ పేరుతో రెండు దశలుగా కార్యక్రమాలు చేపట్టింది. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు బుధవారంతో ముగియనున్నాయి. కేంద్రం ఇచ్చిన నిధులను గత రాష్ట్ర ప్రభుత్వం మళ్లించడంతో నామమాత్రంగా అమలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో 'స్వచ్ఛత' సాకారమవుతోంది.


కాలువను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద అప్పట్లో ఉమ్మడి జిల్లాలో రూ.500 కోట్లు వెచ్చించాయి.

◆ 2014 నుంచి 2018 వరకు అమలైన ఈ కార్యక్రమంలో 3,41,334 గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించారు. లబ్ధిదారులకు రూ.15 వేల చొప్పున చెల్లించారు.

◆ ఓడీఎఫ్ ప్లస్ కింద 'మనం-మన పరిశుభ్రత'లో 55 గ్రామాలకు సామాజిక మరుగుదొడ్లు మంజూరు చేశారు. 35 గ్రామాల్లో నిర్మాణాలు జరగ్గా.. 20 చోట్ల నిర్మాణ దశల్లో ఉండిపోయాయి.

◆ గ్రామాల్లో వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంతలు, ప్లాస్టిక్ రహిత గ్రామాలకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.

గత ప్రభుత్వంలో..

◆ 2,087 గృహాలను గుర్తించి మరుగుదొడ్లు మంజూరు చేయగా.. 1,429 నిర్మాణం పూర్తి చేశారు. 658 నిర్మాణ దశలో ఉన్నాయి.

◆ 530 సచివాలయాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15.90 కోట్లు మంజూరు చేశారు. 197 సచివాలయాల్లో నిర్మాణం జరిగాయి. బిల్లు బకాయిలకు కూటమి ప్రభుత్వం రూ.90 లక్షలు విడుదల చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

మద్యం దుకాణాలకు 9 వరకు దరఖాస్తుల స్వీకరణ


మాట్లాడుతున్న డీసీ బాబ్జీరావు, సీఐ

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానంలోనే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్-ప్రొహిబిషన్ ఉప సంచాలకుడు బాబ్జీరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9లోగా ప్రభుత్వం నిర్ణయించిన రూ.2 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11న దరఖాస్తు చేసుకున్న వారి సమక్షంలోనే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి అందజేయవచ్చని వివరించారు. 12వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వస్తుందని చెప్పారు. పట్టణ సీఐ మన్మథరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు



విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీలు

రాజాం, న్యూస్టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలకు రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. పురుషుల విభాగంలో జీసీఎస్ఆర్ కళాశాల (రాజాం), డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), వర్సిటీ ఆర్ట్సు అండ్ సైన్స్ కళాశాల (ఎచ్చెర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళా విభాగంలో వెంకటేశ్వర ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల (ఎచ్చెర్ల), ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పాలకొండ), జీసీఎస్ఆర్ కళాశాల (రాజాం) తొలి మూడు స్థానాలు సాధించాయని జీసీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.పురుషోత్తమరావు, పీడీ కేశవనారాయణ, యూనివర్సిటీ పీడీ ఎం.శ్రీనివాసరావులు తెలిపారు. జీఎంఆర్ ఐటీ పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో లక్ష్మికి ద్వితీయం



విజయనగరం క్రీడలు, న్యూస్టుడే: బిహార్‌లో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన జాతీయస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన జిల్లాకు చెందిన జి.లక్ష్మి సత్తా చాటింది. 5.91 మీటర్ల లాంగ్ జంప్‌లో రజతం గెల్చుకుంది. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈమె జాతీయస్థాయి అథ్లెట్లలో ఒకరిగా నిలుస్తోంది. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం మంగళవారం రాత్రి హర్షం వ్యక్తం చేసింది.


అద్భుతం.. ఆదివాసీ చిత్రలేఖనం


శిక్షణార్థులు వేసిన వివిధ చిత్రాలు

సీతంపేట, న్యూస్టుడే: సీతంపేటలో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ (ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో ఆదివాసీలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కనుమరుగవుతున్న గిరిజన చిత్రలేఖన కళకు జీవం పోసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నానికి చెందిన లేపాక్షి సిబ్బంది గత రెండు నెలలుగా డిజైన్ డెవలప్‌మెంట్ కార్యశాల, సవర ఆదివాసీ చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. వారి జీవనపాధి కోసం మార్కెట్ సదుపాయం ఈ సంస్థ కల్పిస్తోంది. మాస్టర్ ఎ.శేషగిరి, 20 మంది కళాకారుల బృందం డిమాండ్ ఉన్న 100 వరకు ఉత్పత్తులను రూపొందించారు.

అన్నదమ్ములు.. 'అగ్నివీర్'లు

ఒకే ఎంపికలో ఉద్యోగాలు


ప్రసాద్, రామునాయుడు సోదరులు


సాయికార్తీక్

గజపతినగరం, న్యూస్టుడే: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రక్షణ శాఖ అగ్నివీర్ ఉద్యోగాలకు ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి ఎంపికయ్యారు. మరో వారం రోజుల్లో శిక్షణకు హాజరు కాబోతున్నారు. పాతబగ్గాం గ్రామానికి చెందిన రైతు కూలీ అప్పలనాయుడు, సత్యవతి దంపతులకు ప్రసాద్, రామునాయుడు కుమారులు. వీరు ఆగస్టు నెలలో విశాఖలో నిర్వహించిన అగ్నివీర్ ఉద్యోగావకాశాల్లో జనరల్ డ్యూటీ (జీడీ) విభాగానికి ఎంపికకు వెళ్లారు. అన్ని శారీరక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం ధ్రువపత్రాల ఎంపికలు జరిగాయి. ఉద్యోగాలకు ఎంపికైనట్లు వర్తమానాలు అందాయి. ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేవు. చదువుతుండగానే కుమారులకు ఉద్యోగాలు రావడం పట్ల కన్నవారు సంతోషం వ్యక్తం చేశారు. ప్రసాద్ డిగ్రీ పూర్తి చేయగా బెంగళూరు కేంద్రంలో 8 నెలల శిక్షణకు హాజరు కావాలని ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న రామునాయుడు నాసిక్‌లో శిక్షణకు ఎంపికయ్యారు. వీరిని గ్రామ సర్పంచి లెంక చిన్నంనాయుడు, పెద్దలు అభినందించారు.

దావాలపేట నుంచి ఒకరు..

గజపతినగరం మండలం దావాలపేటకు చెందిన తాయిల సాయికార్తీక్ డిగ్రీ చదివి అగ్నివీర్ ఉద్యోగ ఎంపికకు వెళ్లగా జీడీ విభాగానికి ఎంపికయ్యారు. ఇతనిది నిరుపేద కుటుంబం. తండ్రి ఆదినారాయణ, తల్లి కృష్ణవేణి కూలీలు. కుమారుడికి ఉద్యోగం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన పోలినాటి శ్రీనివాస్, కొండమ్మ దంపతుల కుమారుడు వివేక్ అగ్నివీర్ ఉద్యోగంలో జీడీ విభాగానికి ఎంపికయ్యారు. ఈయన డిగ్రీ చదివి ఒకేసారి ఎంపికకు వెళ్లి ఉద్యోగవకాశాన్ని పొందగలిగారు.

కేజీబీవీ దరఖాస్తుల్లో..

సాంకేతిక సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్టుడే: కేజీబీవీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు గత నెల 26 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల పదోతేదీ వరకు అవకాశముంది. దరఖాస్తు చేసే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. జిల్లాలో సమగ్ర శిక్షా కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డీఈవో ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. అయిదుగురు అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో 70750 39990, 70751 59996 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించవచ్చన్నారు. జిల్లా స్థాయి కంట్రోల్ రూం అధికారులు, సంప్రదించాల్సిన చరవాణి నంబర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

అధికారి	చరవాణి నంబరు
జీసీడీవో	90002 04925
పర్యవేక్షకుడు	94944 65684
ఏఎస్‌వో	97013 60225
ఏజీసీడీవో	80745 51455
సహాయ సీఎంవో	89854 95098

ఉపాధి హామీలో అవినీతిని అరికట్టండి


డ్వామా పీడీ సందీప్‌తో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జి


విజయనగరం ఉడాకాలనీ, న్యూస్టుడే: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టి ప్రజలకు, ప్రభుత్వానికి ఉపయోగపడేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డ్వామా పీడీ సందీప్‌ను కోరారు. మంగళవారం పీడీని కలసి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ఆసరాగా ఉండేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు, గ్రామాల్లో ఆర్థిక పరిపుష్టి ఉన్నవారికి ఉపయోగపడుతోందని తెలిపారు. పలు మండలాల్లో ఒక్కో వేతనదారుడి నుంచి రూ.100 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. నూతన పీడీగా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌ను పౌరవేదిక ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో గోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పోతన్న పాల్గొన్నారు.

మహాత్ముడి మార్గంలో...
మనమెక్కడ?

ఈనాడు–విజయనగరం, న్యూస్టుడే–గరివిడి, చీపురుపల్లి గ్రామీణం

జాతిపిత మహాత్మా గాంధీ కాలంతో ప్రయాణించే మహనీయుడు.. ఆధునిక సమాజానికి స్ఫూర్తి దాయకం.. నేడు బాపూ జయంతి సందర్భంగా ఆయన ఆశయాల ఆచరణలో మనం ఎక్కడ ఉన్నామన్నది మననం చేసుకుందాం. కొన్నింటిని ఉమ్మడి జిల్లాకు అన్వయించుకుని తరచి చూద్దాం.. వాటి అమలుకు ఇంకా ఏమి చేస్తే బాగుంటుందో పరిశీలిద్దాం.

అక్షరమే ప్రగతి కిరణం



అక్షర జ్ఞానం అద్భుత ప్రగతికి మార్గమన్నారు బాపూ. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అక్షరాస్యతలో వెనుకబాటు కొనసాగుతోంది. 2001, 2011 గణాంకాలు చూస్తే పురుషుల్లో 62.37, మహిళల్లో 49.87 శాతం అక్షరాస్యులే ఉన్నారు. ఈ పుష్కర కాలంలో కాస్త పెరిగే అవకాశముంది. అక్షర జ్ఞానం పది మందికి పంచితే అక్షరాస్యత శాతం పెరుగుతుంది.

గ్రామస్వరాజ్యం



సహజ వనరుల వినియోగంతోనే పల్లెల ప్రగతి అన్నది 'గ్రామ స్వరాజ్యంలో నా సలహా' అనే పుస్తకంలో గాంధీజీ పేర్కొన్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి నిధులను దారి మళ్లించడంతో ప్రగతి జాడలు కనుమరుగయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రం ఇచ్చిన రూ.56 కోట్లను పంచాయతీల ఖాతాలకు జమ చేసింది.

స్వయం ఉపాధి

అందరికీ పని దొరకాలంటే స్వయం ఉపాధి పథకాలే కీలకమని జాతిపిత మాట. వెలుగు ఆధ్వర్యంలో రుణాలు పొంది మహిళలు వృత్తి, వ్యక్తిగత వ్యాపారాల్లో రాణిస్తున్నారు. డ్వాక్రా సంఘాల్లోని 7.35 లక్షల మంది సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా పొదుపు చేశారు. చీపురుపల్లి మండలం అలకనారాయణపురం శ్రీమహాలక్ష్మి ఎంపీఎస్‌కు జాతీయ పురస్కారం లభించింది. మిగిలిన సంఘాలు వీరి బాటలో నడిస్తే గ్రామాలు స్వయం పోషకంగా మారతాయి.



శుభ్రతే ఆరోగ్యదాయం



పరిశుభ్రతే ఆరోగ్యానికి ఆలవాలం అన్నది బాపూజీ సూచన. దీని స్ఫూర్తితో కేంద్రం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో చీపురుపల్లి మండలం కర్లాం, సీతానగరం మండలం పెదభోగిలి చెత్త నుంచి సంపద తయారీలో అగ్రగామిగా నిలిచాయి. అయిదేళ్ల వైకాపా పాలన స్వచ్ఛతకు పాతరేసింది. తెదేపా హయాంలో నెలకొల్పిన 895 సంపద కేంద్రాలు ఇటీవల వరకు నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వాటిని మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చి స్వచ్ఛత సాధనకు చర్యలు చేపట్టింది.

విజ్ఞాన సుగంధాలు



ఉభయ జిల్లాల్లోని 41 ప్రభుత్వ గ్రంథాలయాల్లో ఒకటి, రెండు తప్ప మిగిలినవన్నీ నిర్వహణ కొరవడి కునారిల్లుతున్నాయి. ఏటా రూ.6 కోట్లు గ్రాంట్-ఇన్-ఎయిడ్ ఇవ్వాలి. వైకాపా ప్రభుత్వం రూ.24 కోట్లకు బదులు రూ.3.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. 2017 నుంచి నగరపాలక సంస్థ రూ.1.50 కోట్లు, పురపాలక సంఘాల నుంచి రూ.కోటి, పంచాయతీల నుంచి రూ.3.45 కోట్లు జిల్లా గ్రంథాలయ సంస్థకు రావలసి ఉంది.

క్రీడాభివృద్ధికి ఐటీడీఏ కృషి


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని లక్షిత

సీతంపేట, న్యూస్టుడే: ఐటీడీఏ ద్వారా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విలువిద్య (ఆర్చరీ) ఎంపికలు ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ మైదానంలో నిర్వహించారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, చురుకుదనం కలుగుతుందన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో 150 మంది క్రీడాకారులు హాజరవ్వగా, 68 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డీడీ ఎం.అన్నాదొర, ఎంపీడీవో కె.గీతాంజలి, స్పోర్ట్సు ఇన్‌ఛార్జి ఎన్.జాకోబ్ దయానందం, ఏఎంవో పి.కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వెంకటరావు, బి.వి.రమణమూర్తి, కె.రవి, వై.శేఖర్ పాల్గొన్నారు.


సీతంపేటలో మాట్లాడుతున్న ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి చిన్నబాబు

ఆంధ్రా చదరంగ సంఘం సీఈవోగా జ్వాలాముఖి

విజయనగరం క్రీడలు, న్యూస్టుడే: అఖిల భారత చదరంగ సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ క్రీడా అధీకృత సంస్థ వారి సమక్షంలో నిర్వహించిన ఆంధ్రా చదరంగ సంఘం ఎన్నికల్లో కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సమాఖ్య తరఫున పరిశీలకుడిగా అంకుష్ (సంయుక్త కార్యదర్శి, మహారాష్ట్ర), శాప్ తరఫున ఎస్ఏ అజిత్ (డీఎస్‌డీవో, ఎన్టీఆర్ జిల్లా) పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. విజయనగరం జిల్లాకు చెందిన కేవీ జ్వాలాముఖి ఆంధ్రా చెస్ అసోసియేషన్ సీఈవోగా, కోశాధికారిగా కేకే జగన్నాథ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అదనపు ఎస్పీగా సౌమ్యలత


ఎస్పీ వకుల్ జిందాల్‌తో అదనపు ఎస్పీ

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్టుడే: విజయనగరం జిల్లా అదనపు (అడ్మిన్) ఎస్పీగా పి.సౌమ్యలత మంగళవారం పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసు కార్యాలయ పనితీరును పర్యవేక్షించాలని, డీజీపీ కార్యాలయం, రేంజ్ పోలీసు కార్యాలయాలతో జరపాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో కాలయాపన లేకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు. డీఎస్పీగా ఎంపికైన సౌమ్యలత గతంలో బొబ్బిలి, ఇంటెలిజెన్సు, అనిశా విభాగాల్లో పనిచేశారు. అదనపు ఎస్పీకి పలువురు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన బొబ్బిలి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొండదేవుపల్లికి చెందిన ఆర్.కృష్ణప్ప(55) మంగళవారం సాయంత్రం పొలం నుంచి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఇనుప బొరిగే భుజంపై పెట్టుకుని గట్టుపై నడుస్తుండగా కింద వేలాడుతున్న విద్యుత్తు తీగలు దానికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమీపంలోని రైతులు విద్యుత్తుశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఏఈ సాంబశివరావు పరిశీలించి, ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారు.

మలేరియా లక్షణాలతో విద్యార్థిని మృతి

కొమరాడ, న్యూస్టుడే: మలేరియా లక్షణాలతో విద్యార్థిని మృతి చెందిన ఘటన మన్యంలో చోటు చేసుకుంది. కొమరాడ కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న జాకూరు గ్రామానికి చెందిన కద్రక శారద (14) ఇటీవల జ్వరం బారిన పడింది. గత నెల 25న వైద్య పరీక్షలు చేయించగా మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కనిపించాయి. తర్వాత రోజు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షల అనంతరం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తల్లిదండ్రులు దామిని, నరసింహులు తెలిపారు. వీరికి శారద ఆరో సంతానం. ఘటనపై ఎస్‌వో అరుణ వద్ద ప్రస్తావించగా.. మలేరియా అని తెలిసిన తర్వాత వైద్యుల సూచన మేరకు విశాఖ తరలించామని తెలిపారు.

పాముకాటుతో మహిళ మృత్యువాత

లక్కవరపుకోట, న్యూస్టుడే: పాముకాటుతో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని చందులూరు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్ల సూర్యం (60) సోమవారం రాత్రి పనులు ముగించుకొని పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పైకప్పు మీద నుంచి ఆమె నిద్రిస్తున్న మంచంపై పాము పడింది. నిద్రలో కదులుతున్న సమయంలో చేతిపై కాటేసింది. గమనించి కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది.

ఇంట్లో చొరబడి.. దాడి చేసి..

చెముడు(మక్కువ), న్యూస్టుడే: మక్కువ మండలం చెముడు గ్రామానికి చెందిన గొట్టాపు మనోహర్‌రావు ఆయన సోదరుడు కృష్ణమోహన్‌పై విశాఖపట్నానికి చెందిన ఓ మహిళతో పాటు ఆరుగురు వ్యక్తులు దాడి చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండు కార్లలో చెముడు చేరుకుని మనోహర్‌రావు ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడిచేశారు. అడ్డుకున్న ఆయన సోదరుడు కృష్ణమోహన్‌పై కూడా దాడికి తెగబడి ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. గాయపడినవారిని శంబర పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి సాలూరు తరలించారు. దాడి ఎందుకు చేశారో? అనే విషయం దర్యాప్తులో తేలనుంది.

14 కిలోల గంజాయి పట్టివేత

పాచిపెంట, న్యూస్టుడే: ఒడిశా నుంచి విశాఖపట్నానికి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు పాచిపెంట ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి ఒడిశాకు చెందిన మరో ఇద్దరు మహిళలతో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పి.కోనవలస సమీపంలో సోమవారం ఆదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 14.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరిచి మంగళవారం రిమాండుకు తరలించారు.

అత్యాచారం కేసులో 22 ఏళ్ల జైలు

విజయనగరం న్యాయవార్తావిభాగం, న్యూస్టుడే: ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై అత్యాచారానికి పాల్పడిన నేరానికి బొబ్బిలి పట్టణానికి చెందిన డి.రమేశ్‌కు అయిదో అదనపు జిల్లా న్యాయస్థానం 22 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువడింది. వివరాలిలా ఉన్నాయి.. నిందితుడు అదే ప్రాంతానికి చెందిన తనపై 2020లో అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొబ్బిలి పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి న్యాయస్థానంలో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడు రమేశ్ అత్యాచారానికి పాల్పడినట్లు తేలడంతో 22 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

కొత్త తరానికి పురాతన కళలు పరిచయం


వీణ చరిత్రను వివరిస్తున్న లేపాక్షి ప్రబంధకుడు కార్తీక్

బొబ్బిలి, న్యూస్టుడే: నేటి తరానికి పురాతన కళలు పరిచయం చేసేందుకు హస్తకళల అభివృద్ధి సంస్థ ప్రత్యేక కార్యాచరణను రూపొందించిందని లేపాక్షి విశాఖ ప్రాంతీయ ప్రబంధకుడు కె.కార్తీక్ అన్నారు. బొబ్బిలి వీణల కేంద్రంలో హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలలుగా 20 మంది కళాకారులకు వీణల తయారీలో అధునాతన మెలకువలపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఇటీవల 'సవర ఆదివాసీ చిత్రలేఖనం'పై గిరిజన యువతకు, ఔత్సాహికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. బొబ్బిలి వీణకు ఉన్న డిమాండుకు తగ్గ తయారీ లేదని, అందుకే ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. ఏటికొప్పాక బొమ్మలకు గుర్తింపు ఉందని, దీనిపై ఔత్సాహికులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. పురపాలక అధ్యక్షుడు ఎస్.వెంకట మురళీకృష్ణారావు, కమిషనర్ రామలక్ష్మి, కేంద్రం ఇన్‌ఛార్జి సర్వసిద్ధి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు గాంధీ జయంతి వేడుకలు


విజయనగరం విద్యావిభాగం, న్యూస్టుడే: జిల్లా, మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం 8.30 గంటలకు జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్





చరవాణిలో యాప్ ముఖ చిత్రం

న్యూస్టుడే, కలెక్టరేట్ ప్రాంగణం, కొత్తవలస

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారుల వివరాలు ఇకపై యాప్‌లో భద్రంగా ఉండనున్నాయి. దీని కోసం కేంద్రం జనమన్‌రేగా యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. పనికి సంబంధించిన సమగ్ర వివరాలు అందుబాటులో ఉంటాయి.

- యాప్ అందుబాటులోకి తెచ్చిన కేంద్రం
- సమగ్ర వివరాలు అందులోనే

ఎన్నో లాభాలు

జన్‌మన్ రేగా యాప్‌లో వేతనదారుల సమాచారం, హాజరు, వేతనాల వివరాలు ఉంటాయి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి బటన్ నొక్కితే వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరు క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, నగదు మొత్తం, ఏ బ్యాంక్ ఖాతాలో జమ అయ్యిందో తెలుస్తాయి. నగదు జమ కాకపోతే ఎందుకు కాలేదో కారణాలు కనిపిస్తాయి. గతంలో ఈ వివరాల కోసం లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది.

ఫిర్యాదుకు అవకాశం

ఉపాధి హామీ పథకంలో పనికి తగిన వేతనం పడకపోయినా, సంబంధిత ఉద్యోగులు అక్రమాలు, అవినీతికి పాల్పడినా యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేయించినా, సిబ్బంది బిల్లుల చెల్లింపులో ఇబ్బంది పెట్టినా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఈ వివరాలన్నీ ఆయా భాషల్లో అందుబాటులో ఉంటాయి.

అవినీతి తగ్గుతుంది

ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ పథకంలో పారదర్శకత ఉండాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ యాప్‌ను రూపొందించింది. జన్‌మన్‌రేగా యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. వేతనదారులకు చరవాణిలుంటే యాప్ డౌన్‌లోడ్ చేయిస్తాం. శ్రామికుల్లో చైతన్యం వస్తే పనుల్లో అవినీతి తగ్గుతుంది.

– పి.రామచంద్రరావు, డ్వామా పీడీ

ఉభయ జిల్లాల్లో జాబ్‌కార్డులు, హాజరవుతున్నవారు..

జిల్లా	దరఖాస్తులు	ఇచ్చినవి	మనుగడలో ఉన్నవి	వేతనదారులు	హాజరవుతున్నవారు
విజయనగరం	3,83,695	3,82,984	3,51,810	6,85,511	5,92,881
పార్వతీపురం మన్యం	2,08,853	2,08,256	1,92,525	3,95,572	3,51,271

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

గరివిడి, వంగర, బాడంగి: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనం అవుతుందని డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మంగళవారం గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ జి.శంకరరావు, ఎస్సై లోకేశ్వరరావు ఉన్నారు. వంగర మండలం మద్దువలస జూ.కళాశాలలో సీఐ ఉపేంద్రరావు, బాడంగి మండలం భీమవరంలో సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది.


ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్పీ రాఘవులు, సిబ్బంది

ఫిర్యాదుపై విచారణ

రామభద్రపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాగోలేదని, నిర్వాహకుల్ని విధుల నుంచి తప్పించాలని సర్పంచి కె.రమణ, తెదేపా నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంఈవో రమామణి, ఎంఈవో తిరుమల ప్రసాద్ క్షేత్రస్థాయిలో విచారించారు. భోజనాన్ని రుచి చూసి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

మీకోసం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రామభద్రపురం - 80085 74308
గంట్యాడ - 80085 74348

? మామిడిపల్లిలోని సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. - స్థానికులు
● తగిన చర్యలు తీసుకుంటాం. - వెంకటరమణ, ఈవోపీఆర్డీ
– న్యూస్‌టుడే, రామభద్రపురం

? కొండగండ్రేడు ఉన్నత పాఠశాలలో వసతి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు
● కొత్త భవనాల నిర్మాణం పూర్తయ్యేలా చూస్తాం. - భానుప్రకాశ్, ఎంఈవో – న్యూస్‌టుడే, గుర్ల

? కమ్మవలస- కొండదేవుపల్లి గ్రామాల మధ్య మట్టి రహదారి కావడంతో వర్షం పడితే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - స్థానికులు
● జబీవల జరిగిన గ్రామ సభలో ఇరు గ్రామాల మధ్యలో సిమెంటు రహదారి నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. నిధులు విడుదల కాగానే పనులు చేస్తాం. - రాజశేఖర్, ఏఈ
– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

? గోడియాడ గ్రామంలోని మండల పరిషత్తు పాఠశాల రహదారిపై మురుగు చేరి, పిల్లలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు
● మురుగు రాకుండా చర్యలు చేపడతాం. - భానోజీరావు, ఈవోపీఆర్డీ
– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

అమరాంలో అధ్వానం

నేటిచిత్రం

రాజాం మండలం అమరాం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ప్రాథమిక పాఠశాల వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే మార్గంలో మురుగు నిలిచిపోతోంది. అపరిశుభ్ర వాతావరణంతో దోమలు విజృంభిస్తున్నాయని, పిల్లలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు.
– న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం





తొలగిన అంధకారం

స్పందనకు వందనం

చీపురుపల్లి: చీపురుపల్లిలోని విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలిగాయి. ఈ సమస్యపై గత నెల 'ప్రధాన రహదారులు అంధకారం' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొత్త దీపాలు ఏర్పాటు చేశారు.



ఇది జిన్నాం పంచాయతీ మల్లునాయుడు పేటకు వెళ్లే రహదారి. నిత్యం ఇలాగే ఉంటోంది. ద్విచక్ర వాహనాలు వెళ్లలేవు. కాలి నడకే దిక్కు.. దీని అభివృద్ధిని దశాబ్దాల తరబడి పట్టించుకోలేదు. ఇప్పుడు తారు రహదారి వేసేందుకు రూ.1.20 కోట్లు మంజూరు చేశారు. ఈ మార్గం వల్ల జిన్నాం నుంచి తుమ్మికాపల్లి మీదుగా లోగీశ, కెంగువ గ్రామాలకు, గుర్ల మండలానికి వెళ్లేందుకు 5 కి.మీ దూరం తగ్గుతుంది.

118 రహదారులు.. రూ.19 కోట్లు

న్యూస్‌టుడే, గజపతినగరం

గత అయిదేళ్లు పల్లెల రహదారుల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే వాటి అభివృద్ధికి అడుగులు వేసింది. గజపతినగరం నియోజకవర్గంలో దారుల అభివృద్ధికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చర్యలు తీసుకున్నారు. అన్ని మండలాల్లో ప్రాథమిక దశలో 118 పనులకు ప్రభుత్వం రూ.19.23 కోట్లు మంజూరు చేసింది. పనులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

వివరాలు ఇలా..

మండలం	మంజూరైన పనులు	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
గజపతినగరం	25	4.39
గంట్యాడ	38	5.32
బొండపల్లి	32	2.50
దత్తిరాజేరు	23	7.02

పల్లె 'దారు'లు అభివృద్ధికి నిధులు

పారిశుద్ధ్యం మెరుగుపడేలా..

గ్రామాల్లో సిమెంటు రహదారులు, వీధి కాలువలు ఒకేసారి నిర్మించేలా పనులు మంజూరు చేశారు. రెండింటిని ఒకేసారి నిర్మించడంతో మురుగు నిల్వ ఉండేందుకు అవకాశం లేకుండా ఉంటుందని, తద్వారా పారిశుద్ధ్య సమస్య తగ్గుతుందని అధికారులు తెలియజేస్తున్నారు. గజపతినగరం మండలం లోగీశ, మరుపల్లి, పాతబగ్గాం, కొనిశ, వేమలి, రామన్నపేట గ్రామాలకు రూ.4.39 కోట్లు కేటాయించారు. పనులు చేయించేందుకు ఇంజినీరింగు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పనులు ప్రారంభిస్తాం

గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నిబంధనల మేరకు పనులు ప్రారంభించి వేగవంతం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజల ఇబ్బందులు తీరేలా రహదారులు, సీసీ కాలువల నిర్మాణం చేపట్టనున్నాం. – ప్రసాద్, డీఈఈ, పీఆర్, గజపతినగరం

దుమ్ముతో అవస్థలు



బుడతనాపల్లి- కొటారుబిల్లి కూడలిలో రహదారిపై దుమ్ముధూళితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది లారీలతో కంకర తరలిస్తున్నారు. గోతులు ఏర్పడి, సుమారు పది అడుగుల ఎత్తులో దుమ్ము రేగుతోంది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ నందకుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తక్షణమే సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

మలుపులతో భయాందోళన

గుర్ల మండలం నాగళ్లవలస వద్ద రహదారి మలుపు ప్రమాదకరంగా ఉంది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక.. ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కోటగండ్రేడు శివాలయం సమీపంలో, జమ్ముపేట దాటాక, గొలగాం, గరిడ, గరికివలస వద్ద కూడా ఇదే పరిస్థితి ఉందని, కనీసం ప్రమాద సూచికలు పెట్టడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రభ డీఈఈ శ్రీనివాస్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. ప్రమాద సూచికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల



పొంచి ఉన్న ప్రమాదం



మెంటాడ మండలం రెడ్డివానివలస సమీపంలోని మలుపులో ఉన్న నియంత్రికకు రక్షణ లేకుండా పోయింది. ఇది తక్కువ ఎత్తులో ఉండటంతో మార్గంలో రాకపోకలు సాగించే వారు ఆందోళన చెందుతున్నారు. పశువులకు తగిలితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని, రక్షణ వలయం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై గజపతినగరం ఏడీఏ శివకుమార్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పారు. – న్యూస్‌టుడే, మెంటాడ

సమస్యల పరిష్కారానికి విన్నపం

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బేబినాయన సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అమరావతిలో మంగళవారం విద్యుత్తు, ఆరోగ్య శాఖ మంత్రులు రవికుమార్, సత్యకుమార్ యాదవ్‌కు స్వామి ప్రసాదాన్ని అందజేశారు. విద్యుదాఘాతంలో బొబ్బిలి నియోజకవర్గంలోని పలువురు రైతులకు చెందిన పశువులు ఇటీవల మృతి చెందాయని, వారిని ఆదుకోవాలని కోరారు. గ్రామాలకు నాణ్యమైన విద్యుత్తు అందించాలన్నారు. అదేవిధంగా సామాజిక ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సత్యకుమార్‌ను కోరినట్లు బేబినాయన తెలిపారు.


మంత్రి రవికుమార్‌కు లడ్డూ అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

సమన్వయంతో పని చేయాలి


అధికారుల తీరుపై మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యులు

గంట్యాడ, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పి.హైమావతి అన్నారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో సర్పంచి, ప్రాదేశిక సభ్యులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం పద్ధతి కాదన్నారు. దీనికి ముందు ఏవో శ్యాంకుమార్ సాగు పరిస్థితులను వివరించారు. ఆపై వివిధ శాఖల ప్రగతిని సంబంధిత అధికారులు సభ దృష్టికి తీసుకెళ్లారు. జడ్పీటీసీ సభ్యుడు వర్రి నర్సింహమూర్తి, ఎంపీడీవో వై.భవాని తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన


చీపురుపల్లిలో నిరసన



రాజాంలో ర్యాలీ

రాజాం, చీపురుపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, సిటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శంకరరావు, జగన్మోహన్ డిమాండు చేశారు. రాజాంలో ర్యాలీ నిర్వహించారు. ఉచిత ఇసుక విధానం వెంటనే అమలు చేయాలని కోరుతూ చీపురుపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికులు ప్రధాన రహదారిలో ర్యాలీ చేపట్టారు.

శతశాతం పంపిణీకి చర్యలు


పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టరు అంబేడ్కర్

గజపతినగరం, చీపురుపల్లి, మెరకముడిదాం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శతశాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు అంబేడ్కర్ మంగళవారం ఎంపీడీవో కిశోర్‌కుమార్, తహసీల్దారు రత్నకుమార్‌ను ఆదేశించారు. గజపతినగరంలోని పురిటిపెంట న్యూకాలనీలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ఉదయం 8 గంటలకే మండలంలో 75 శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో తెలిపారు. జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, ఇతర అధికారులు పాల్గొన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. చీపురుపల్లి మండలం జి.అగ్రహారంలో పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే జి.బాబూరావు, నాయకులు కె.త్రిమూర్తులరాజు, ఆర్.కామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ● మెరకముడిదాం మండలం గొల్లలవలస, రాచపేట, పూతికవలస, యాడిక గ్రామాల్లో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పింఛన్లు అందజేశారు.


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

'పొలం పిలుస్తోంది'తో ప్రయోజనం

రేగిడి, న్యూస్‌టుడే: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజాం వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కె.చంద్రరావు అన్నారు. చాటాయవలసలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త కె.లక్ష్మణ్, రైతుశిక్షణ కేంద్రం ఏడీఏ భారతి పాల్గొని రైతులకు సూచనలు అందజేశారు. సర్పంచి గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, ఏవో మురళీకృష్ణ పాల్గొన్నారు. ● **గంట్యాడ గ్రామీణం:** సాంకేతిక పరిజ్ఞానం అందించడమే 'పొలం పిలుస్తోంది' లక్ష్యమని విజయనగరం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. గంట్యాడ మండలం కొర్లాం, గొడియాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతోపాటు తెదేపా మండలాధ్యక్షుడు కె.భాస్కరరావు పాల్గొన్నారు. ● **బొబ్బిలి గ్రామీణం:** శివడవలస, చిత్రకోటబొడ్డవలస గ్రామాల్లో ఏడీఏ శ్యామ్‌సుందర్ రైతులకు చీడపీడలపై అవగాహన కల్పించారు.

క్రీడోత్సాహం

రాజాం: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్సై రవికిరణ్, ప్రిన్సిపల్ ఎస్.ప్రభాకరరావు, ఏవో ఎల్లంనాయుడు పాల్గొన్నారు.


విద్యార్థుల పిరమిడ్ విన్యాసం

అరెస్టు చేయాలి

బొబ్బిలి: సీబీఎం పాఠశాల కరస్పాండెంటు రత్నకుమార్‌ను అరెస్టు చేయాలని వామపక్ష ప్రజా సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాల స్థలాన్ని విక్రయించే హక్కు ఆయనకు లేదన్నారు. రైతు సంక్షేమ సంఘ నాయకుడు వి.లక్ష్మునాయుడు, సీపీఐ నాయకులు ఎం.శ్రీనివాసరావు, శ్రావణ కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

3న ప్రజాదర్బార్

తెర్లాం: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 3న తెర్లాంలో ఎమ్మెల్యే బేబినాయన ప్రజాదర్బార్ నిర్వహించనున్నారని తెదేపా మండల నాయకులు ఎన్.వెంకటినాయుడు, వెంకటేశ్వరరావు విలేకరులతో అన్నారు.

అప్రమత్తత అవసరం

రేగిడి: ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తత అవసరమని కేర్ అండ్ సపోర్టు సెంటర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టరు ఎన్.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని సంకిలిలో ఎయిడ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రక్తదానంపై అవగాహన

చీపురుపల్లి: యువత రక్తదానానికి ముందుకు రావాలని ఆశయ సంస్థ అధ్యక్షుడు ఆర్.రమణ కోరారు. జాతీయ రక్తదాన మహోత్సవాల్లో భాగంగా చీపురుపల్లి జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతకు రక్తదానంపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

వృద్ధులకు అండగా నిలవాలి

గుర్ల: పేద వృద్ధులకు అందరూ అండగా నిలవాలని ఎస్సై నారాయణరావు అన్నారు. గుర్లలో వృద్ధమిత్ర కో-ఆర్డినేటరు కామేశ్వరరావు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి రామారావు, జేవీవీ సభ్యులు ఈశ్వరరావు, పద్మలత పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం పని చేస్తున్నాయని క్లబ్ జిల్లా సభ్యుడు జి.నారాయణరావు అన్నారు. మండలంలోని ప్రధాన రహదారులు, పాఠశాల ఆవరణలో 25 వేల పండ్ల మొక్కల విత్తనాలను నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కొర్లాం, పెదవేమలి, పెంటశ్రీరాంపురం పాఠశాల ఆవరణలో నాటారు.

కలహాలు లేకుండా చూడండి

గరివిడి: వెదుళ్లవలసలో ప్రభుత్వ భూమిలో అనధికారికంగా నిర్వహిస్తున్న చర్చిని తొలగించాలని విశ్వ హిందూ పరిషత్తు ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ సూర్యనారాయణ, సభ్యులు, గ్రామస్థులు ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. గ్రామంలో మత కలహాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సేవలకు సన్మానం

బొబ్బిలి గ్రామీణం: బొబ్బిలి పంచాయతీరాజ్‌శాఖ డివిజన్ కార్యాలయంలో పనిచేసిన సాంకేతిక అధికారి రామప్రసాదరావు ఉద్యోగ విరమణ సందర్భంగా మండల పరిషత్తు కార్యాలయంలో ఈఈ శ్రీనివాసులు, డీఈ సీహెచ్‌వీ అప్పారావు, ఏఈలు, సిబ్బంది సత్కరించారు. ● చీపురుపల్లి: చీపురుపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జి.సత్యనారాయణ దంపతులను జడ్పీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బి.చంద్రశేఖర్ తదితరులు సత్కరించారు.

డీఎల్‌డీవోగా కిరణ్‌కుమార్



బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో)గా ఎం.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. శ్రీకాకుళంలో మెప్మా పీడీగా చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన విధుల్లో చేరినట్లు తెలిపారు.

యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు


పిల్లలతో మాట్లాడుతున్న కల్పన

గజపతినగరం, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఎన్సీఈఆర్టీ ద్వారా ఏర్పాటు చేసిన ప్రశస్త యాప్‌లో సహిత పాఠశాలల్లో ఉన్న చిన్నారుల సమాచారాన్ని నమోదు చేస్తున్నట్లు రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయ కర్త ఎస్.కల్పన అన్నారు. గజపతినగరం భవిత కేంద్రాన్ని సందర్శించారు. యాప్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే విషయాలను నిర్ధారించి, ప్రభుత్వ సహాయం అందించేలా చూస్తామని చెప్పారు. జిల్లా సహిత విద్య సహాయ సమన్వయకర్త ఎం.భారతి పాల్గొన్నారు. బొబ్బిలిలో భవితా కేంద్రాన్ని కూడా కల్పన పరిశీలించారు. దస్త్రాలు చూసి.. గతం కంటే పిల్లల నమోదు బాగుందన్నారు. ఎంఈవో లక్ష్మణరావు ఉన్నారు

తిరువీధి ఉత్సవం


అమ్మవారి ఘటం దర్శించుకుంటున్న భక్తులు

రాజాం, న్యూస్‌టుడే: రెండేళ్లకోసారి నిర్వహించే రాజాం గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ఘటం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

రేగిడి, బొబ్బిలి గ్రామీణం, దత్తిరాజేరు, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం పారాది ఉన్నత పాఠశాల విద్యార్థులు బెల్లాన సుప్రియ, అల్లాడ తేజస్విని, పి.చైతన్యకుమారి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటనాయుడు తెలిపారు. నానిబాబు, మణికంఠ, మన్విత, అవంతిక, గణేష్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో సత్తా చూపారు. రేగిడి మండలం కందిశ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఇప్పిలి రేష్మ, కర్రి లహరి, కబడ్డీలో మీసాల గౌతమి, సోడిశెట్టి లోకేశ్వరి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.నారాయణరావు తెలిపారు. దత్తిరాజేరు మండలం షికారుగంజి ఆదర్శ పాఠశాల విద్యార్థులు బి.విమల, బి.రోహన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ రాజేష్ తెలిపారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పారాది బాలికలు

రూ.లక్షలు ఖర్చు చేసి.. వదిలేశారు


కెల్లలో నిరుపయోగంగా సచివాలయ భవనం

న్యూస్‌టుడే, చీపురుపల్లి, గుర్ల

చీపురుపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సచివాలయాల భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. చీపురుపల్లిలోని సంతమార్కెట్‌లో చివరి దశలో పనులు ఆగిపోవడంతో అక్కడితో వదిలేశారు. ప్రస్తుతం సిబ్బంది మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలోని స్త్రీశక్తి భవనంలో ఉంటున్నారు. కొత్త కార్యాలయంలో చీకటి పడితే మందుబాబులు ఉంటున్నారని స్థానికులు అంటున్నారు. అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని ఇంజినీరింగ్ అధికారి రమేష్ తెలిపారు. గుర్ల మండలం కెల్లలో నిర్మించిన భవనం ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. పనులు పూర్తయి ఏడాది కావస్తున్నా వదిలేశారు. త్వరలోనే సిబ్బందిని తరలిస్తామని ఇంజినీరింగు అధికారి సాల్మాన్ రాజు చెప్పారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

మెంటాడ: 'ఫ్రెండ్లీ పోలీస్'లో భాగంగా లోతుగెడ్డ ఎస్సీ కాలనీకి చెందిన యువకులకు సీఐ జీఏవీ రమణ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. ఎస్ఐ సీతారాం, సర్పంచి బీమారావు ఉన్నారు.

చెత్త వేస్తే చర్యలు తప్పవు

బొబ్బిలి: పట్టణంలో చాలా చోట్ల నియంత్రికల చుట్టూ చెత్త కనిపిస్తోందని, ఇకపై వేస్తే సహించేది లేదని కమిషనర్ రామలక్ష్మి అన్నారు. శ్వేతాచలపతి పాఠశాల ట్రాన్స్‌ఫార్మర్, తాండ్రపాపారాయ బొమ్మ వద్ద వ్యాపారులు చెత్తలు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం - 80089 02900
విజయనగరం గ్రామీణ - 80085 74317
ఎస్.కోట - 80085 74326
భోగాపురం - 80085 74319

* శ్రీనగర్‌కాలనీ, బొబ్బాదిపేట ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. - స్థానికులు
● పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఎస్.అప్పారావు, డీఈఈ
* తోటపాలెం మండల పరిషత్తు పాఠశాల దాటిన తర్వాత ప్రదీప్‌నగర్ వద్ద రహదారి గోతులమయంగా తయారైంది. - స్థానికులు
● అత్యవసర మరమ్మతులు చేయిస్తాం. - కె.శ్రీనివాసరావు, ఈఈ
- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం
* తోటపల్లి ద్వారా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇంటింటి కుళాయిలు ఉన్నా ప్రయోజనం లేదు. - అప్పన్న, స్థానికుడు
● సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటాం. - వైకుంఠనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్, డీఈ
- న్యూస్‌టుడే, భోగాపురం

దీపాలు వెలిగాయ్ (స్పందనకు వందనం)

విజయనగరం పట్టణం: కొన్నుగుడ్డి రింగ్ రోడ్ రాజాగారి షెడ్, కస్తూరినగర్, గోపాలనగర్, పీఎస్‌ఆర్ కాలనీల్లో వీధి దీపాల సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు ఫిర్యాదు చేశారు. డీఈఈ ఎస్.అప్పారావు దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకున్నారు.

నిర్మాణ సామగ్రి తొలగించారు

విజయనగరం పట్టణం: అలకానంద కాలనీ ఎంజీఓ 68 దగ్గర నగర పాలక సంస్థ కాలువను కప్పేసి వేసిన భవన నిర్మాణ సామగ్రి వేశారని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఐదవార్డు టీపీవో ఫిలిప్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకున్నారు.


సన్మానం చేస్తున్న ఛైర్మన్, కమిషనరు అప్పలరాజు

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత తోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఛైర్మన్ బి.సరోజ, కమిషనరు అప్పలరాజు అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. రెండు ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహణకు నగరవాసులంతా సహకరించాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

భోగాపురం, న్యూస్‌టుడే: కూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అప్పన్న మంగళవారం తెలిపారు. గతనెల 23న అనంతపురంలో జరిగిన సబ్‌జూనియర్స్ పోటీల్లో ఆర్.సాత్విక్, డి.దుర్గాదేవి, యు.లోకేశ్వరి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 8 నుంచి శ్రీనగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

విజయవాడకు ప్రత్యేక బస్సులు

విజయనగరం కోట: విజయదశమి సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారిని సందర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు విజయనగరం డిపో ప్రబంధకుడు జె.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడతో పాటు భక్తులు కోరిన పుణ్యక్షేత్రాల సందర్శనకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు 99592 25620, 94943 31213 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరిశుభ్రతకు పెద్దపీట


క్రీడా సామగ్రి అందించిన ఎమ్మెల్యే

విజయనగరం పట్టణం, క్రీడావిభాగం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. కమిషనరు నల్లనయ్య, సిబ్బందితో కలిసి మంగళవారం విజ్జీస్టేడియం ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. హాకీ క్రీడాకారులకు సామగ్రి అందజేశారు. సహాయ కమిషనరు తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డా.కె.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి బాటలు

ఉపాధి నిధులతో గ్రామాల్లో వసతుల కల్పన

వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. గత అయిదేళ్లు అధికారంలో ఉండి కూడా ఎలాంటి పనులూ చేయలేకపోయామని సర్పంచులు బాధపడ్డారు. 14వ ఆర్థిక సంఘం నిధులు వారికి తెలియకుండానే వెనక్కి తీసేసుకున్నా.. మారు మాట్లాడలేని పరిస్థితి. రాజ్యాంగబద్ధంగా పంచాయతీలకు రావాల్సిన నిధులను పక్కదారి పట్టించడంతో పల్లెలు సమస్యలతో సతమతమవుతున్నాయి. నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి బాటలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో పల్లెల్లో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది.

న్యూస్‌టుడే, కొత్తవలస


సిమెంటు రోడ్డుగా రూపుదిద్దుకోనున్న ఎన్జీవో కాలనీలోని ఓ మట్టి దారి

శృంగవరపుకోట నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో 136 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో రూ.24.88 కోట్లు ఉపాధి నిధులతో 433 పనులు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. సిమెంటు రహదార్లు, కాలువలు, మెటల్ రోడ్ల నిర్మాణం వంటి పనులు చేయడానికి నిర్ణయించారు. ఏ గ్రామంలో ఏ పనిచేయాలో ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు వెళ్లకుండా గ్రామాల్లో పనులు కల్పించేందుకు కేంద్రం ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా రూ.కోట్లు కేటాయిస్తోంది. ఈ నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు అనుసంధానం చేసి పల్లెల రూపురేఖలు మార్చే వేతనదారులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గుర్తించిన పనుల వివరాలు..

మండలం	గ్రామ పంచాయతీలు	పనుల సంఖ్య	ప్రతిపాదించిన నిధులు (రూ.లక్షల్లో)
కొత్తవలస	25	98	631.2
లక్కవరపుకోట	31	81	650.75
వేపాడ	29	100	370.95
శృంగవరపుకోట	26	104	513.6
జామి	25	50	321.5
మొత్తం	136	433	2,488.00

పంచాయతీల్లో తీర్మానాలు..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఇటీవల ఒకేరోజున గ్రామసభలు నిర్వహించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించారు. ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో చెరువులు, కాలువలు అభివృద్ధి, పంట కాలువల్లో పూడికతీత వంటి పనులే జరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో మౌలిక వసతుల సంబంధించిన పనులను గుర్తించారు.

ప్రాధాన్య క్రమంలో పనులు..

పంచాయతీల్లో ప్రతిపాదించిన పనులన్నీ ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని అధికారులకు సూచించాం. వైకాపా పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనుల ఊసే లేదు. పల్లెల్లో చేయాల్సిన పనులు గుర్తించి ఉపాధి నిధులతో చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా వేతనదారులకు ఉపాధి కల్పనతోపాటు పల్లెల ప్రగతికి బాటలు వేయాలని భావిస్తోంది. త్వరలో పనులు మొదలుకానున్నాయి. - కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్యే, శృంగవరపుకోట

వృద్ధులపై వేధింపులు సరికాదు

మయూరి కూడలి, న్యూస్‌టుడే: వయోవృద్ధులను వేధింపులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వయోజనుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కపుగంటి ప్రకాశ్ అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా నగరంలో ర్యాలీ చేశారు. చంద్రశేఖర్, జగన్నాథరావు, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

కార్మికుల సమస్యలపై ఆందోళన

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు, శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.రంగరాజు డిమాండు చేశారు. మంగళవారం కార్యాలయం ఎదుట ప్రధాన కార్యదర్శి కామేశ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నెల 10లోగా డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. రామకృష్ణ, శ్రీనివాసరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా బాధ్యతల స్వీకరణ

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస ఎక్సైజ్ సీఐగా జి.రాజశేఖర్‌నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి వచ్చారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. సర్కిల్ పరిధిలోని కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాల్లో 16 మద్యం దుకాణాలు ఉన్నాయని, అనుమతి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రారంభానికి నోచుకునేదెన్నడో?

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ప్రాంతంలోని మొయిద ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో నాబార్డు సహకారంతో రూ.40 లక్షలతో గోదాం నిర్మించారు. 500 మెట్రిక్ టన్నులు నిల్వ చేసేందుకు ఉపయోగపడుతుంది. నిర్మించి రెండేళ్లవుతున్నా ప్రారంభించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మొయిద సొసైటీ సీఈవో వి.గిరిబాబును వివరణకోరగా.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, నెల్లిమర్ల



దెబ్బతిన్న కల్వర్టు



ఎస్.కోట పట్టణం పుణ్యగిరి రోడ్డులో ఉన్న జగన్నపు కాలనీకి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతింది. గెడ్డ నీరు భారీగా రావడంతో కింద నుంచి మట్టి కోసేసి ఎడమ వైపు పైపులు పక్కకు ఒరిగిపోయాయి. కాలినడకన, నిర్మాణాలకు సామగ్రి తీసుకొచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 2022లో ఇక్కడ శాశ్వత కల్వర్టు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసినా.. పనులు మాత్రం జరగలేదు. ఈ విషయం మండల ఇంజినీరింగు అధికారి సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. పంచాయతీ సర్పంచితో మాట్లాడి ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని, శాశ్వత కల్వర్టు కోసం ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. - న్యూస్‌టుడే, శృంగవరపుకోట

అపరిశుద్ధ్యం.. అవస్థలమయం

భోగాపురం మండలంలోని ముంజేరు పంచాయతీ మధ్యగ్రామం దానాపేటలో పారిశుద్ధ్య ఇబ్బందులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లోని నీరు రహదారిపై పారుతూ.. దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉండిపోవడంతో దోమలు వ్యాపిస్తున్నాయి. రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. దీనిపై ఎంపీడీవో అప్పలనాయుడు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. తక్షణమే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, భోగాపురం



అంకితభావమే.. స్ఫూర్తిదాయకం


ఎస్పీ వకుల్ జిందాల్‌తో ఉద్యోగ విరమణ పొందినవారు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: పోలీసు ఉద్యోగంలో రోజూ కొత్త రకమైన సవాలు ఎదురవుతూ ఉంటుందని, వాటిని సమయస్ఫూర్తితో ఎదుర్కొని, సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆర్మ్‌డ్ రిజర్వు ఏఎస్సై మహంతి వెంకటరమణకు పోలీసు శాఖ తరఫున పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. వెంకటరమణ దంపతులను ఎస్పీ వకుల్‌జిందాల్ సత్కరించారు. అదనపు ఎస్పీ, పలువురు డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం పొందిన చామలాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.శ్రీనివాస్, పీజీఎస్ సతీష్‌కుమార్‌ను సర్పంచి సూర్యారావు, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ జ్యోతి తదితరులు సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణ పాల్గొన్నారు. * విజయనగరం అర్బన్: ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పరిషత్తు పరిపాలనాధికారి కచ్చాల కృష్ణమూర్తి దంపతులను జడ్పీ సమావేశ మందిరంలో ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, సెట్విజ్ సీఈవో రామ్‌గోపాల్, జడ్పీ ఉప సీఈవో రాజ్‌కుమార్, జిల్లా పరిషత్తు ఉద్యోగులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్థులు


కృష్ణమూర్తి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు



ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట పట్టణంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు విజయదశమి వేడుకలు నిర్వహించారు. మహంతి కౌముది గ్లోబల్ స్కూల్ చిన్నారులు దుర్గాదేవి, మహిసారుడు, శ్రీరాముడు, రావణాసురుడు వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు.

నడకదారిలో వెళితే ప్రమాదం కాదా?

విజయనగరం పెద్దచెరువు ఒడ్డున నిర్మించిన మహాత్మాగాంధీ వాకింగ్ ట్రాక్ పరిస్థితి దారుణంగా తయారైంది. వైకాపా ప్రభుత్వ హయాంలో 14వ ఆర్థిక సంఘ నిధులు, అమృత్ 2.0 తదితర నిధులు రూ.2.45 కోట్లతో అభివృద్ధి చేసినా.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. పనికిరాని చెట్లు, ముళ్ల పొదలతో పరిసరాలు నిండిపోవడంతో బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. మూడు చోట్ల గేట్లు తెరవడంతో పశువులు చేరుతున్నాయి. కొత్తాగ్రహారం, గాజులరేగ, మంగళవీధి, కర్రల మార్కెట్ ప్రాంతం, బూర్లిపేట, చుట్టుపక్కల కాలనీల నుంచి ఇక్కడకు పలువురు నడకకు వస్తారు. పశువులతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య వద్ద ప్రస్తావించగా.. ఇక్కడ కాపలాదారును త్వరలో నియమిస్తామన్నారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



మర్యాదపూర్వక కలయిక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: వైకాపాను వీడి జనసేనలో ఇటీవల చేరిన అవనాపు విక్రమ్, భావన దంపతులు మంగళవారం పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కె.గౌరీశంకర్, ఈశ్వర్‌రాజు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.


అశోక్‌తో విక్రమ్, భావన దంపతులు

గిరిశిఖర గ్రామాలను గుర్తించాలి

శృంగవరపుకోట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జుగా పథకం కింద అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిశిఖర గ్రామాలను తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం సభ్యులు కోరారు. సంఘం ప్రతినిధి జె.గౌరీష్ మంగళవారం దబ్బగుంటలో మాట్లాడారు. దారపర్తి, మూల బొడ్డవర పంచాయతీలు, వేపాడ మండలం మారిక గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మయూరి కూడలి: చేనేత వృత్తిపై ఆధారపడిన పద్మశాలి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుకు మరింత కృషి చేయాలని జిల్లా పద్మశాలి సంఘం విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ వి.వీరభద్రరావు అన్నారు. పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నందం అబద్దయ్యను మంగళగిరిలో కలిసి సమస్యలు వివరించినట్లు వారు తెలిపారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

శృంగవరపుకోట: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ ఇస్తోందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. సీహెచ్.కేశవరావు అన్నారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ కళాశాల సమన్వయకర్త డా.జి.ఈరన్న మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

న్యాయవాది మృతికి సంతాపం

న్యాయవార్తావిభాగం: జిల్లాలో సీనియర్ న్యాయవాదిగా ఉన్న ద్వారపురెడ్డి స్వరూప్‌కుమార్ (63) మంగళవారం గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఈయన మృతికి పలువురు న్యాయవాదులు, న్యాయమూర్తులు విచారం వ్యక్తం చేశారు.

ఉద్యమాలే మార్గం

మయూరి కూడలి: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని సీపీఎం నగర కార్యదర్శి శంకరరావు అన్నారు. రామకృష్ణనగర్‌లో శాఖ మహాసభ నిర్వహించారు. సీపీఎం జెండా ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు రమణమ్మ, శాంతమూర్తి ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరం

శృంగవరపుకోట: మాదకద్రవ్యాల వినియోగం శరీరం, మనసు మీద తీవ్ర ప్రభావం చూపుతుందని సీఐ వి.నారాయణమూర్తి అన్నారు. పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో పలు కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల ఫిర్యాదుల పెట్టె ప్రారంభించారు.

కేంద్రమంత్రికి సత్కారం

భోగాపురం: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును రాష్ట్ర మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మంగళవారం శ్రీకాకుళంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించారు. కె.రాజు, పి.తోటరావు ఉన్నారు.



3 నుంచి కామాక్షి ఉత్సవాలు

కంటోన్మెంట్: బొండాడవీధిలోని మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు అక్టోబరు 3 నుంచి 12 వరకు జరగనున్నాయని ఆలయ అధ్యక్షుడు సోమరాజు తెలిపారు.

ఉత్సాహంగా ఈత ఎంపికలు

విజయనగరం క్రీడలు: అండర్-14, 17 బాలబాలికల స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపికలు కంటోన్మెంటు ప్రభుత్వ ఆక్వా స్పోర్ట్స్ పూల్‌లో మంగళవారం నిర్వహించారు.

ఆలయాల్లో జనసేన ప్రాయశ్చిత్త దీక్ష

విజయనగరం కంటోన్మెంట్: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు జిల్లాలో జనసేన నాయకులు ప్రాయశ్చిత్త దీక్షలు చేపడుతున్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.యశస్వి తోటపాలెం బాలాజీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అవనాపు విక్రమ్, రౌతు సతీష్, దాసరి యోగేష్ తదితరులు పాల్గొన్నారు. మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో పార్టీ నాయకులు 108 కొబ్బరికాయలు కొట్టారు.

రామతీర్థంలో బ్రహ్మోత్సవాలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. 3న విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, 4న విశేష హోమాలు తదితర పూజలు ఉంటాయన్నారు.

తితిదే కల్యాణ మండపాలు ఏర్పాటు చేయాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పార్లమెంటరీ పరిధిలో నాలుగు చోట్ల తితిదే కల్యాణ మండపాలు ఏర్పాటు చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. మంగళవారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో శ్యామలరావును మర్యాదపూర్వకంగా కలిశారు. రణస్థలం మండలం కొండమూలగాంలో నిర్మాణానికి సిద్ధమైన స్వామి ఆలయానికి సహాయం అందించాలని ఈవోను కోరారు.


నిత్యాన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న ఎంపీ దంపతులు

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి



విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం దశలవారీగా నష్టాల్లోకి నెడుతూ గనులు కేటాయించకుండా పనికి రానిదిగా తయారు చేస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, వెంకటేష్ ఆరోపించారు. విశాఖ ఉక్కును కాపాడాలన్న నినాదంతో మంగళవారం కేఎల్‌పురం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. కలెక్టరేట్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ర్యాలీ

విజయనగరం కోట, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని సంస్థ ఉద్యోగులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని సంస్థ కార్యాలయం నుంచి కోట, మూడు లాంతర్ల కూడలి, గంట స్తంభం వరకు ర్యాలీ చేశారు. డీజీఎం దాలినాయుడు మాట్లాడుతూ నూతన సామర్థ్యాలను కూడగట్టుకుని మెరుగైన సేవలకు, ఇతర సంస్థల కంటే తక్కువ ధరకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఏజీఎంలు శ్రీధర్, మురళీధర్, ఉద్యోగులు జగదీశ్, సీహెచ్ శారద, శైలజ పాల్గొన్నారు.

